# పగ - ప్రాణం

"డాక్టర్ కాళిదాసు ఉద్యోగం ఊడటానికి కారణం మీకు తెలుసా?" విస్కీ బాటిల్ ఓపెన్ చేస్తున్న నన్ను అడిగాడు మూర్తి.

"ఏమో... చాలా కారణాలు విన్నాను. కాని పూర్తి వివరాలు ఇంకా తెలియలేదు". కార్క్ టపీమని ఎగిరి అల్లంత దూరాన పడింది.

మురళి నాలుగు గ్లాసులూ బల్ల మీద వరసగా పెట్టాడు.

గుప్తా -- "థ్యాంక్స్ టు డాక్టర్! చాలా కాలం తర్వాత మళ్లీ రుచి చూస్తున్నాను" అన్నాడు.

"నాకు డాక్టర్ కాళిదాసు ఉద్యోగం ఊడటానికి కారణం ఏమిటో, ఎందుకలా అయాడో అన్నీ - బాగా తెలుసు. చెప్పనా?" మూర్తి మళ్లీ అన్నాడు.

మురళి అన్నాడు: "చెప్పండి, డాక్టర్; నాకు ఎప్పటినుంచో ఆ విషయం తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది".

బాటిల్ వంచి నాలుగు గ్లాసుల్లోనూ కొద్ది కొద్దిగా పోశాడు. క్లబ్ బాయ్ నాలుగు

సోడాలు కొట్టి, నాలుగు గ్లాసుల్లోనూ పోశాడు.

అందరం గ్లాసులు అందుకున్నాం. గ్లాసుపై కెత్తి "చీర్స్" అని, కొద్దిగా చప్పరించాను.

"మొదలు పెట్టండి సార్" అన్నాను.

"అసలు విషయం చెప్పేముందు కాళిదాసుగారి గురించి, ఆయన అంత తక్కువ కాలంలో అంత ఎక్కువ డబ్బు ఎలా సంపాదించినదీ వివరంగా చెప్పండి" అన్నాడు మురళి.

నేను కుతూహలంగా ముందుకు వంగాను.

"ఒక డాక్టర్ గురించి, అందులోనూ కాళిదాసు లాంటి డాక్టర్ గురించి సాటి డాక్టర్ నయిన నేను చెప్పకూడదనుకోండి. కాని... మీరు అడుగుతున్నారు కనుక నే చేప్పే విషయాలు మీ ముగ్గుర్నీ దాటి బయటకు పోవనే నమ్మకం చేతా చెబుతున్నాను".

గ్లాసు పైకెత్తి ఇంకో గుటక వేసి, ప్రారంభించాడు మూర్తి.

"నేరు గవర్నమెంటు హాస్పిటల్లో చేరిన కొత్తలో ఎక్కువగా కాళిదాసుగారి ఇంటికే వెడుతుండే వాడిని. మనిషి ఎటువంటివాడయినా, వృత్తి రీత్యా నాకు గురువుగారు కావటం వల్ల ఆయన అంటే ఒక విధమైన గౌరవభావం ఉండేది. ఆ రోజు సాయంత్రం ఇద్దరం కూర్చుని ఉన్నాం. ఒక ముసలాయన రిక్షా దిగి లోపలికి వచ్చాడు. తన బాధలన్నీ, వర్ణించి చెప్పాడు. అవన్నీ విని నేను ఆయన కేమీ రోగం లేదనీ, వయసు వల్ల వచ్చిన నీరసం అనీ గ్రహించాను. కాళిదాసుగారు ఆయన్నీ స్టెత్‌తో పరీక్షించి కనుబొమ్మలు ముడిచారు. ఆయన్ని బల్ల మీద పడుకోబెట్టి, మళ్లీ స్టెత్‌తో పరీక్షించారు. ధర్మామీటర్‌తో టెంపరేచర్ చూశారు. నార్మల్‌గా ఉంది, నేనూ చూశాను. బి.పి.ఇన్‌స్ట్రుమెంట్ తెచ్చి బ్లడ్ ప్రెషర్ చూశారు. నార్మల్‌గా ఉంది.

'మీతో ఎవ్వరూ రాలేదా?' అని అడిగారు.

'లేదండీ!' ఆయనలో ఏదో గాభరా కనపడుతూంది. డాక్టరుగారు ఏం చెబుతారా అని ఆత్రంగా చూస్తున్నాడు.

'ఇటువంటివి పేషెంట్సుతో చెప్పకూడదండీ -- ఎలాగ? మీతో ఎవరూ రాలేదాయె!' అని నసిగారు.

ఆ ముసలాయన ఒక అడుగు ముందుకు వేశాడు. ఆయన పల్స్ ఏ వంద సార్లో కొట్టుకుంటున్నదనిపించింది నాకు. ఏదో అనబోయాడు.

ఇంతలో కాళిదాసుగారే అన్నారు: 'గాభరా పడకండి. తగ్గిపోతుంది. బ్లడ్ ప్రెషర్ మీకు చాలా ఎక్కువగా ఉంది. 200/120 ఉంది.చాలా ఎక్కువే అనుకోండి, అయినా ఫరవాలేదు. మీకు నయంచేసే బాధ్యత నాది'.

నాకు మాత్రం నోట మాట రాలేదు. బ్లడ్ ప్రెషర్ నార్మల్‌గా ఉండటం నా కళ్ళతో చూశాను. మరి ఆయన..

'ఈ టెస్టులన్నీ చేయించి రేపు సాయంత్రం కనిపించండి. మందులు రాసి ఇస్తాను. అవసరం ఉంటే ఇంజక్షన్స్ చేద్దాం. మీరేం దిగులుపడనఖ్కర్లేదు. అంతా నాకు వదిలేయండి'

చిన్నగా నవ్వారు, ఆయనకు ధైర్యం చెబుతూ.

ఆయన ముఖంలో మునుపటి భయం పోయి ధైర్యం వచ్చిన ఛాయలు కనపడ్డాయి.

ఆయన నమస్కారం పెట్టి వెళ్లబోయాడు.

'రాఘవయ్యగారూ... ఫీజు విషయం....'

'ఆఁ! మరిచాను, బాబూ' అన్నా డాయన నొచ్చుకుంటూ.

'ఆఁ దాందేముంది లెండి! ముందు ఓ పాతిక ఇవ్వండి. జబ్బు తగ్గాక మిగతాది చూసుకోవచ్చు'.

ఆయన పాతిక రూపాయలూ ఇచ్చి ముందుకు కదిలాడు.

రాఘవయ్యగారు వెళ్లిన తరవాత డాక్టర్‌గార్ని అడిగాను అదే విషయం.

ఆయన నవ్వారు. 'మూర్తీ! నువ్వు అయితే ఈ కేసులో ఏం చేసేవాడివి?' అని అడిగారు.

గొంతు సవరించుకున్నాను. 'ఆయనకు వయసు వల్ల వచ్చిన నీరసం తప్ప ఇంకే జబ్బూ లేదని చెప్పేవాడిని. బలమైన ఆహారం తీసుకోమనే వాడిని. ఆహార నియమాలు పాటించమనే వాడిని. అనుమానంతో వచ్చాడు కనుక ఏ విటమిన్ టాబ్‌లెట్సో, టానిక్కో -- ఏది కావాలో కనుక్కొని రాసి ఇచ్చేవాడిని...'

'తరవాత...' ఆయన మళ్లీ నవ్వారు.

'తరవాత.... ఏముంది?' ఏమనాలో తెలియలేదు.

ఆయన పెద్దగా నవ్వారు. 'పేషెంటు వెళ్లిపోయేవాడు. నువ్వేమో గోళ్లు గిల్లుకునే వాడివి... అంతేనా!'

నాకు ఒక నిమిషం ఏమీ అర్థం కాలేదు. తరవాత అర్థం చేసుకుని ఆశ్చర్య పోయాను. ఆయన ఉద్దేశ్యం తెలుసుకుని మనస్సులో నొచ్చుకున్నాను.

'రేపు ఇదే సమయానికి రావోయ్ -- నా పేషెంటుని చూద్దువు గాని' అన్నారాయన.

జరగబోయేది చూచాయగా తెలిసినా, కుతుహలం కొద్దీ మర్నాడు వెళ్లాను".

మూర్తి ఒక్క క్షణం ఆగి, గ్లాసు ఖాళీ చేశాడు. కళ్లు మూసుకున్నాడు.

మురళి అప్పటికే రెండు గ్లాసులు పూర్తిచేసి, మూడో గ్లాసు నింపుకుంటున్నాడు. నేను, గుప్తా మాత్రం ఊరికే కొద్ది కొద్దిగా చప్పరిస్తూ కథ వింటున్నాం.

"రాఘవయ్యగారు చాలా గాభరాగా వచ్చాడు -- చేతిలో ఒక ఎక్స్‌రే, ఇంకా ఏవోకాగితాలు పట్టుకుని. ఒక క్షణం అవి చూసి, కాళిదాసుగారు అవన్నీ నాకు అందించారు. ఆయన కడుపులో బాధగా ఉంటున్నదన్నాడు కనుక అది కడుపుకు తీసిన ఎక్స్‌రే. నాకేమీ దోషం కనపడలేదు. ఒక కాగితం యూరిన్ టెస్ట్‌ది. ఒకటి బ్లడ్ టెస్ట్‌ది. ఒకటి ఇ.సి.జి. ఒకటి ఇ.ఎస్.ఆర్. నాకు దేనిలోనూ దోషం కనపడలేదు. కుతూహలంగా చూశాను కాళిదాసుగారివేపు.

ఆయన రాఘవయ్యగారికి బి.పి. చూస్తున్నారు. నేనూ చూశాను. నార్మల్ కన్నా

కొంచెం ఎక్కువగానే ఉంది. పాపం ఎంత గాభరా పడ్డాడో మానవుడు!

'ఈ మందులు వాడండి' అని ఒక కాగితం మీద విటమిన్ 'బి' టాబ్‌లెట్స్, ఇంకా ఏవో అవీ ఇవీ వ్రాసి ఇచ్చారు. 'రోజు విడిచి రోజు ఇంజక్షన్ తీసుకోవాలి. నా దగ్గర ఆ ఇంజక్షన్స్ ఉన్నాయి లెండి. నేనే ఇస్తాను. మీరు నాకే పే చేద్దురుగాని'.

ఆయన -- 'డాక్టర్‌గారూ! అసలిది ఎందుకు వచ్చిందంటారు?' అని ఇంకా ఏదో అడుగుతున్నాడు.

కాళిదాసుగారు వినిపించుకోలేదు. సిరెంజ్ సిద్ధం చేసుకుని, ఇంజక్షన్ చేసి, 'మళ్లీ ఎల్లుండి కనిపించండి!' అన్నారు.

ఆయన ఏదో అడగబోయాడు.

'మీరు గాభరా పడకండి. అంతా నేను చూసుకంటాను' అని ఆయన్ని పంపించేశారు.

తరవాత ఆయన మాటలు విని మూర్ఛపోయేంత పనయింది. అన్ని టెస్టలూ చేయించటం వల్ల రెండు లాభాలు మొత్తం ఆయనికి. ఒకటి ఈ హడావిడి అంతా చూసి రోగి డాక్టర్‌ను వదిలి పెట్టడు. భయపడి, ఎంత అడిగినా పే చేస్తాడు. రెండు -- ప్రైవేటుగా ఎక్స్‌రే తీసేవాళ్లూ, రక్తం పరీక్ష చేసే వాళ్లూ, యూరిన్ పరీక్ష చేసేవాళ్లూ -- ముందు అనుకున్న అగ్రిమెంటు ప్రకారం రోగి ఇచ్చే దానిలో కొంత పెర్సెంటేజ్ డాక్టర్‌కి ఇస్తారు. అదీ కాక హాస్పటల్‌కి వచ్చిన కేసుల్ని ఇంటికి పిలిపించి ఫీజు వసూలు చేస్తారు. అన్నిటికన్నా ముఖ్యమైన దేమిటంటే ఆయన ఇచ్చే ఇంజక్షన్స్ -- మెడికల్ రిప్రజంటేటివ్స్ ఆయన కిచ్చిన శాంపిల్స్ -- వాటిని పొడిచి, పొడిచినందుకు, కొంత, ఆ ఇంజక్షన్స్ బజార్లో ఎంతకు అమ్ముతున్నారో అదీ కలిపి వసూలు చేస్తాడు. అదీకాక, ఎక్స్‌రే వాళ్లతో ఉన్నట్టే మెడికల్ షాపులతోనూ కొంత లాలూచీ. అదే ఆయన అంత కొద్ది కాలంలో, అంత ఎక్కువ సంపాదించిన రహస్యం".

మూర్తి ఆపి, సీసాఎత్తి తన గ్లాసులో కొద్దిగా వంపుకున్నాడు. క్లబ్ బాయ్ సోడా కొట్టి గ్లాసులో పోశాడు.

అతను చెప్పేవి వింటూంటే నిజమేనా అనిపించింది. చనిపోయే మనషుల్ని బ్రతికించవలసిన వైద్యుల్లో, డబ్బు కోసం తమలోని మానవత్వాన్ని చంపుకునే వారూ ఉంటారా అనిపించింది.

గుప్తా కళ్లు టపటపా ఆర్పి, టేబుల్ మీద బిస్కెట్ అందుకున్నాడు.

మురళి తన ముందు ఉన్న ఖాళీ సీసాని వేలితో నిమురుతూ సన్నగా గొణుగుతున్నాడు ఏమిటో.

మూర్తి అన్నాడు: "కాళిదాసుగారి ఉద్యోగం ఎందుకు ఊడిందో చెబుతాను"

పై కెత్తుతున్న గ్లాసుని క్రిందికి దించి, కుతూహలం కొద్దీ ముందుకు వంగాను.

"ఆయన సంపాదించే డబ్బుతోపాటు ఆయనలోని అహంభావం కూడా పెరగసాగింది. తన క్రింద పనిచేసే డాక్టర్లని, నర్సులని చాలా హీనంగా చూసేవాడు. దానితో దాదాపు

అందరికీ ఆయనంటే ఒక విధమైన ఏహ్యాభావం ఏర్పడింది. అంతే కాదు. ఆయన చేత అవమానాలు పొందిన ఒకరిద్దరు డాక్టర్లు, ఆయన మీద ఎలాగయినా దెబ్బ తీయాలని ఆయన్ని జాగ్రత్తగా పరిశీలించటం మొదలెట్టారు. ఆయన డబ్బు దాహం ఎంత వరకూ వచ్చిందంటే -- హాస్పిటల్లో బెడ్ ఇవ్వటానికి పదిహేను రూపాయల నుంచి వంద రూపాయల దాకా లంచం తీసుకునే వాడు. అదే ఆయన్ని పట్టించింది కూడాను. డబ్బు తీసుకుని బెడ్స్ ఇస్తున్నాడనే నెపం మీద ఆయన్ని రెడ్ హేండెడ్‌గా పట్టుకున్నారు. అంతే కాక ఆయన మీద ఇంకా నాలుగైదు కేసులు రిజిష్టర్ చేసి రుజువు చేశారు. అదీ కాక ఒక మరీ ముఖ్యమైన విషయ మేమిటంటే - ఆయన చేసిన ఒకటి రెండు ఆపరేషన్ కేసులు ఫెయిలయినాయి. పేషెంట్లు చనిపోయారు. కారణాలు విచారించగా - కడుపు ఆపరేషన్ చేసిన పేషెంటుకి, కడుపులోనే ఫోర్‌సెప్స్ పెట్టి కుట్లు వేశాడనీ; ఎడమ కాలు ఆపరేషన్ చేసి తీసివేయవలసిన పేషెంటుకి కుడి కాలు తీసివేశాడనీ ఋజువయింది. దానితో ఆయన ఉద్యోగం ఊడింది.''

చెప్పటం ఆపిన మూర్తి గబగబా రెండు గ్లాసులు ఖాళీచేసి, మళ్లీ మూడో గ్లాసు నింపుతున్నాడు. ఎర్రబడిన కళ్లతో మూడో గ్లాసుని కూడా మరుక్షణంలో ఖాళీ చేశాడు.

చిన్నగా నిట్టూర్చాను. డబ్బు కోసం, ఒకడు సాటి మానవుడి ప్రాణాలను గడ్డిపోచకంటె హీనంగా చూసి, వాటితో ఆటలాడుతున్నాడంటే -- అతని మానవత్వం ఏమయినట్లు? ముఖ్యంగా ప్రాణం పోయవలసిన డాక్టరే డబ్బు కోసం కక్కుర్తిపడి తన విద్యుక్త ధర్మాన్నే విస్మరిస్తే ఎలా? ఆయన చదువూ, సంస్కారం ఏమవుతున్నట్టు?

-- అదే అన్నాను మూర్తితో. మూర్తి వినే స్థితిలో లేడు. రెండు బాటిల్సూ ఖాళీచేసి బల్ల మీదకి ఒరిగి పోయాడు. ముఖమంతా చెమట పట్టి ఉంది.

గుప్తా అన్నాడు: "దీనిలో ఒక చిదంబర రహస్యం కూడా ఉంది".

ఆసక్తిగా చూశాను అతనివేపు.

"కాళిదాసు ఆ పేషెంటు కడుపుకి కుట్లు వేసేటప్పుటడు మూర్తి కూడా ఆ ఆపరేషన్ థియేటర్లోనే ఉన్నాడు. ఫోర్‌స్లెప్స్ కడుపులోనే ఉంచి కుట్లు వేయటానికి కారణం -- మూర్తే. అదంతా రహస్యంలే! పైకిమాత్రం కాళిదాసుగారి పేరు వచ్చింది! మూర్తి తప్పించు కున్నాడు!"

ఆశ్చర్యపోయాను.

"అందుకు కారణం?" అడిగాను.

" కాళిదాసు డబ్బు, అహంకారం అంతకు ముందు రెండు మూడుసార్లు కాళిదాసు మూర్తికి చేసిన అవమానం -- పగ సాధించుకోవటానికి ఒక అమాయకుడి ప్రాణాన్నే బలి తీసుకున్నాడు మూర్తి".

గుప్తా గ్లాసులో మిగిలిన కాస్త విస్కీ ఖాళీ చేశాడు.